


బాల్యవివాహాల నిషేధిత పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఐఆర్‌టిడబ్ల్యుఎ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికను మంగళ వారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతు బాల్య వివాహాలు జరుగుతున్నట్లు ఎటువంటి సమాచారం దగ్గర్లో ఉన్నా పోలీస్ స్టేషన్ ఆఫీసర్‌కు తెలపాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పి.కె. ప్రకాష్ పాల్గున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

రెండో రోజూ కదంతొక్కిన అంగన్‌వాడీలు

- ర్యాలీ, మావనహారం
- సమస్యలు పరిష్కారం చేయకుంటే సిఎం ఇంటిని ముట్టడి
- న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం : ప్రజాసంఘాలు



పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం మాదిరిగా వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు చేపట్టిన 36 గంటలు నిరసన ధర్నా రెండో రోజు మంగళవారం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు కథం తొక్కారు. రెండు రోజులుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వంట వార్పు చేసుకొని, సెలవులు పెట్టి నిరసన ధర్నాలో వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రోడ్డుపై మొక్కవోని దీక్షతో ఎక్కడా పట్టుసడలకుండా ప్రతికూల వాతావరణం ఉన్నా తమ సంకల్పబలం నిరూపించి ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. జిల్లా వ్యాప్తంగా 15మండలాల నుండి 4వేలమందికి పైగా అంగన్‌వాడీలు రెండవరోజు మంగళవారం ఉదయం 6గంటలకే దూరాభారం లెక్కచేయకుండా ప్రయివేట్ వాహనాల్లో దీక్షా శిబిరానికి హాజరై తమ సత్తాచాటారు. ప్రజా నాట్య మండలి సభ్యులు కోరాడ ఈశ్వరరావు అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై పాడిన పాటలు ఆలోచింపజేశాయి. అనంతరం కార్యకర్తలతో కలెక్టర్ కార్యాలయం నుండి పార్వతీపురం పాతబస్టాండు వరకూ భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం చేపట్టారు. అనంతరం డిఆర్‌ఒ జె.వెంకట్రావుకు వినతిని అందజేశారు.

ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, అధ్యక్ష కార్యదర్శులు పి.సరళ, జి.జ్యోతిలక్ష్మి కోశాధికారి, బిఅమరవేణి, రాష్ట్ర కమిటీ నాయకులు విరామలక్ష్మి మాట్లాడుతూ తల్లీపిల్లల ఆరోగ్యపరిరక్షణలో, చిన్నారుల ఆలనాపాలనలో తమదైన కీలకపాత్ర నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు చాలీచాలని జీతాలతో పనికి తగిని వేతనం లభించక, అనేక ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు, దీనికితోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్న విద్యుత్, గ్యాస్ ధరలతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వత్తిడులు తీవ్రమైన మనోవేదనలకు గురిచేస్తున్నాయని అన్నారు. ఏళ్లతరబడి పనిచేస్తున్న కార్యకర్తలకు రూ11500, ఆయాలకు రూ.7500 మాత్రమే వేతనం ఇస్తున్నారని, ప్రభుత్వాలు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోవడంతో ఆగ్రహించి, తమ ఆవేదన వ్యక్తం చేయడాని కోసం ఇలా రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించందని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వాలు కళ్లుతెరిచి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే అందోళన ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో సిఎం ఇంటిని ముట్టడిస్తామన్నారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న అంగన్‌వాడీలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని సిఐటియు జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు, నాయకులు వి.ఇందిర, జి.వెంకటరమణ, రైతుసంఘం నాయకులు బంటు దాసు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు ఎం.వెంకటరమణ, పి.రాజశేఖర్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బివి రమణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, పి.సన్యాసిరావు, బి.లక్ష్మి, పెద్దసంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.





నిరసన శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు



ఏరియా ఆస్పత్రి పనులను అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఏజెన్సీలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

పలు అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన ప్రాంతంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. అడలి వ్యూ పాయింట్ (పర్యాటక సర్క్యూట్)ను ఐటిడిఎ పిఒ కల్పనా కుమారితో కలిసి పరిశీలించారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా పర్యాటకుల సందర్శన కోసం క్యాంపింగ్ టెంట్లు, ఫుడ్ కోర్టు, ఫోటో సెషన్‌కు అనువుగా వ్యూ పాయింట్ ఏర్పాటుకు పనులకు సంబంధించి సూచనలు చేశారు. సెప్టెంబర్ నెలాఖరులోగా పర్యాటక అభివృద్ధి పనులను పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ ఇఇ ఎస్. సింహాచలంను ఆదేశించారు. రూ.కోటీ 60 లక్షలతో ఏర్పాటు చేస్తున్న గిరిజన మ్యూజియంను పరిశీలించారు. ఐటిడిఎ నిర్మిస్తున్న పర్యాటక సర్క్యూట్‌లో భాగంగా రెస్టారెంట్, ఫుడ్ కోర్టు, లంచ్ పాయింట్, వాణిజ్య దుకాణాలు నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రూ.19.07కోట్లతో చేపడుతున్న 100 పడకల భవన పనులను పరిశీలించారు. గైనకాలజీ , ఓపి విభాగం ఫ్లోర్లను నిశితంగా పరిశీలించారు. ఆగస్ట్ 15 నాటికి ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పజెప్పాలని గుత్తేదారును ఆదేశించారు. రూ.49.26 కోట్లతో చేపడుతున్న మల్టీస్పెషల్టి ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. బ్లాకుల నిర్మాణం, నిధుల చెల్లింపు విషయాలను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నాటికి ఆసుపత్రిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం మండలంలోని కిండంగిలోని నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయం భవనాన్ని, సోమగండిలోని రైతు భరోసా కేంద్రాన్ని, గ్రామ సచివాలయం భవనాన్ని పరిశీలించారు. అనంతరం హడ్డుబంగిలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను సందర్శించారు. నాడు-నేడు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు జగనన్న గోరు ముద్ద క్రింద అందిస్తున్న మెనూపై ఆరా తీశారు. రన్నింగ్ వాటర్ సౌకర్యం, పిల్లల భోజన గదిని పరిశీలిం చారు. ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూతికవలస నుండి ద్వారబంధం వరకు సుమారు 3 కిలో మీటర్ల మేరకు నిర్మించిన తారు రోడ్డును పరిశీలించారు. పనుల వివరాలను పంచాయితీ రాజ్ ఇఇ ఎస్.రాధా రాణి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట పంచాయతీ రాజ్ డిఇ లోకనాథం, ఎఇ పి.కిరణ్ కుమార్, ఎపిఎంఐఎస్ ఎఇ ఇంద్రసేనారెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ బి శ్రీనివాసరావు, డిడి ఎం.శ్రీనివాసరావు, ఉప విద్యా శాఖ అధికారి ఎ.లిల్లీ రాణి, ఎంఇఒలు డి.సూర్యచంద్రరావు, ఆనందరావు హడ్డుబంగి హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.



బిఎల్‌ఒల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కులో చేర్పించాల్సిన బాధ్యత బిఎల్‌ఒలదేనని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన బిఎల్వోలకు ఓటు హక్కు, చేర్పులు, మార్పులపై అవగాహన కల్పించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండలంలో గల బిఎల్వోలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బిఎల్‌ఒలతో సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపు ప్రతి బిఎల్‌ఒ ఇంటింటికి వెళ్లి ఓటర్ల సర్వేను నమోదు చేయాలని అన్నారు. గ్రామాల్లో మృతి చెందిన వారిని ఓటర్ల లిస్టు నుంచి తప్పించి కొత్త ఓట్లు నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటును నమోదు చేయాలని అన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే సహించేది లేదని అన్నారు. ఆయన వెంట తహశీల్దార్ జె.రాములమ్మ ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని నరిసిపురంలో హార్టికల్చరల్ రైతులు, ఉపాధిహామీ పథకంలో ద్వారా పెంచుతున్న జీడిమొక్కలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 15లోగా లబ్దిపొందుతున్న వేతనదారులు మొక్కలు నాటే కార్యక్రమం పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన మన్యం

రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీ వ్యాధులతో మంచం పట్టింది. ఏ గ్రామం చూసిన జ్వర పీడితులే దర్శనమిస్తున్నారు. నాలుగు నెలల పాటు వ్యాధుల తీవ్రత కనిపిస్తూనే ఉంటుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో అపారిశుధ్య వాతావరణం, దోమల వ్యాప్తి, కలుషిత నీరు కారణంగా గిరిజనులు వ్యాధుల బారిన పడుతున్నారు. వైద్యం కోసం వస్తున్న రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. స్థానికసామాజిక ఆరోగ్య కేంద్రంలో రోజువారి ఓపి 150కి పైగా నమోదవుతూనే ఉంది. ముఖ్యంగా మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో రోగులు వైద్యం కోసం వస్తున్నారు. వీరిలో ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, గర్భిణీలు, వృద్ధులే ఎక్కువ. రోగుల సంఖ్య పెరగడంతో గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన వస్తోంది. మరోవైపు మారుమూల ప్రాంతాలైన దుడ్డు ఖల్లు, రేగిడి, తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కూడా ఆయా ప్రాంతాల నుంచి గిరిజనులు పెద్దసంఖ్యలో వైద్యం కోసం వస్తున్నారు. అయితే ఆసుపత్రిలో కనీస సౌకర్యాల్లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం కురుపాం, పార్వతీపురం వంటి దూరప్రాంతాలకు వెళ్లి వైద్యం పొందుతున్నారు. కొండలపై గ్రామాల్లో గిరిజనులకు వైద్య సేవలు నేటికీ గగనమవుతోంది. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రోగులను డోలీల సాయంతో తీసుకొస్తున్న పరిస్థితి. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులు నియామకం లేకపోవడంతో స్థానికంగా విద్యార్థులకు వైద్యమందడం లేదు. దీంతో సమీపంలో ఉన్న ఆసుపత్రులకు తీసుకువచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏజెన్సీ లో వైద్య సేవలు మెరుగుపరచాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

ముందస్తు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

కురుపాం : ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మంగళవారం స్థానిక రావాడ జంక్షన్ కాంప్లెక్స్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో ఎక్కువ మంది గిరిజనులు మలేరియా, డెంగీ తదితర వ్యాధుల బారిన పడుతున్నారని, గతంలో అనేకమంది గిరిజనులు ఈ వ్యాధులు బారిన పడి సరైన వైద్యం అందక మృత్యు వాత పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని కోరారు. నియోజకవర్గ కేంద్రాలైన కురుపాం, పాలకొండ, సాలూరులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను త్వరగా నిర్మించినట్లయితే గిరిజనులకు వైద్య సేవలు మరింత చేరువులో ఉంటాయన్నారు. కావున తక్షణమే ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోలక అవినాష్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులతో కిక్కిరిసిన ఏరియా ఆసుపత్రి

సీతంపేట : ఏజెన్సీలో వైరల్, మలేరియా, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల కాలంలో తీవ్రంగా ఎండలు కాయడంతో పాటు వర్షాలు కురవడంతో కలుషిత జలాలు తాగడంతో గిరిజనుల ప్రాణాల మీదకు కొని తెచ్చుకుంటున్నారు. ప్రతి గిరిజన గ్రామంలో వైరల్ జ్వరాలు ఉన్నాయి. దీంతో స్థానిక ఏరియా ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. రోజూ 400 వరకు ఓపి ఉన్నప్పటికీ వీటిలో 30 వరకు వైరల్ జ్వరాలతో గిరిజనులు బాధపడుతున్నారు. వీటిలో సీతంపేట, దోనుబాయి, కోసమానుగూడ, చిన్నపల్లకి, పెద్దపల్లంకి తదితర గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికే చిన్న పల్లకిలో మలేరియా పాజిటివ్ నమోదైంది. స్థానిక ఏరియా ఆస్పత్రిని అప్ గ్రేడ్ చేసినా ఇంకా 30 పడకలతోనే నిర్వహణ జరుగుతుంది. ఇప్పటికే రోగులు తాకిడి ఎక్కువగా ఉండడం, పడకల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు చొరవతో ఎన్ఆర్‌సి నుంచి అదనంగా 24 బెడ్‌లను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, కుసిమి పిహెచ్‌సి పరిధిలో కుసిమి, కోడిశ తదితర గ్రామాల నుంచి వైరల్ జ్వరాలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నాయి. ధోనుబాయి పిహెచ్‌సి పరిధిలో వారం రోజుల క్రితం చిన్న పల్లంకి, పెద్ద పల్లంకిలో నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయి. అలాగే ధోనుభాయి, టీటికిపాయిలో మూడు మలేరియా కేసులో నమోదయ్యాయి. దోమతెరలు వాడకపోవడం, పారిశుధ్యం లోపించడం వంటిపై అవగాహన కల్పించకపోవడంతో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇదిలా ఉండగా చిన్నపిల్లలకు అత్యవసర వైద్యం అందించాలనే ఉద్దేశంతో రోగుల తాకిడి ఎక్కువగా ఉన్నప్పటికీ రిఫర్ చేయకుండా కొన్ని సందర్భంలో ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్యం అందించాల్సిన పరిస్థితి వస్తుంది.



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులు



గుమ్మలక్ష్మీపురంలో ఆస్పత్రిలో క్యూకట్టిన జ్వరపీడితులు

పాఠశాలను తనిఖీ చేసిన పిఒ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని రావాడ రామభద్రాపురంలో పాఠశాలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ మంగళవారం తనిఖీ చేశారు. జగనన్న విద్యా కిట్లు పంపిణీ, హాజరు, ఇతర రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థి దశలో విద్యపై దృష్టి సారించాలని హితవు పలికారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుండే బోధన పక్కాగా ఉండాలని, విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయాలని ఆయన చెప్పారు. ఆహారం అందించడంలో, తయారీలో పూర్తి స్థాయి బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న క్లాప్ వాహనాల డ్రైవర్లు

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తమకు బకాయి పడ్డ రెండు నెలల వేతనాలను చెల్లించాలని క్లాప్ ఆటో డ్రైవర్లు మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పల నాయుడును కోరారు. మంగళవారం క్లాప్ వాహనాల డ్రైవర్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, కోశాధికారి గొర్లి వెకటరమణతో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌తో వారు మాట్లాడుతూ, రెండు నెలలుగా బకాయి పడ్డ వేతనాలను చెల్లించాలని, జీవో 7 ప్రకారం అమలు చేసిన కనీస వేతనం రూ.18,500 చెల్లించాలని, కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని, పిఎఫ్ స్లిప్‌లు ఇవ్వాలని, వాహనాల మరమ్మతుల ఖర్చులు రెగ్యులర్‌గా విడుదల చేయాలని లేనిచో భవిష్యత్తు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్రైవర్లు ఎన్.త్రినాథ, ఎన్. అప్పలరాజు, ఎస్. సాయికుమార్, బి. సతీష్ ధావన్ వి. జయ, రాజశేఖర్ ఎం. మధు, ఆర్.మురళీకృష్ణ, బి.సాయి, జి.చంటి, ఎస్. పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు..

టిడిపి అధికారంలోకి వస్తే పూర్ణపాడు వంతెన పూర్తి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

టిడిపి చేపట్టిన భవిష్యత్తుకు గ్యారంటీ బస్సు యాత్ర మండలంలోని ఉల్లిభద్ర తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా కుడి ప్రధాన కాలువ వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు విగ్రహానికి కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ తోయక జగదీశ్వరితో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అలాగే పూర్తిస్థాయిలో సాగునీరు అందించని జంఝావతి కాలువ, తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని ఎడమ కాలువ వద్ద మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, జగదీశ్వరి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, నియోజకవర్గం పరిశీలకులు ఆరేటి మహేష్, టిడిపి నాయకులు నాయకులు సెల్ఫీ దిగారు. అనంతరం తోటపల్లి వరకు బస్సు యాత్రతో పాటు మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం తోటపల్లి వద్ద జరిగిన బహిరంగ సభలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొమరాడ : 2024 ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నియోజకవర్గంలోనే దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేస్తామని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయిక జగదీశ్వరి అన్నారు. మండలంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బస్సు యాత్ర పూర్ణపాడు లాభేషు వద్దకు మంగళవారం చేరుకుంది. ఈ సందర్భంగా ముందుగా టిడిపి నాయకులు వంతెన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం వంతెన ప్రాంగణంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. టిడిపి మండల కన్వీనర్ శనపతి ఉదయశేఖర్ పాత్రుడు అధ్యక్షతన జరిగిన సభలో జగదీశ్వరి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాంతంలో పాదయాత్రకు వచ్చి వంతెన పూర్తి చేస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో వంతెన మంజూరు చేసి 70శాతం పనులు చేశామని, వైసీపీ వచ్చి నాలుగున్నరేళ్లు కావస్తున్నా ఒక్క శాతం కూడా వంతెన పనులు చేయకపోవడం చూస్తే గిరిజనుల పక్షాన వైసిపి ప్రభుత్వం ఏ మేరకు పాలన చేస్తుందో అర్థమవుతుంది అన్నారు. మొన్న కురుపాం వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి వెళ్ళిపోయారు తప్ప నియోజకవర్గంలో గిరిజనులు ఎదుర్కొంటున్న కనీస సమస్యలపై ప్రస్తావించక పోవడం చాలా దురదష్టకరమని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కూడా సమస్యలను ముఖ్యమంత్రి దష్టిలో పెట్టకపోవడం చూస్తే నియోజకవర్గ ప్రజలపై ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుందని అన్నారు. నియోజవర్గంలోనే ఒకవైపు ఏనుగులు, మరోవైపు పూర్ణపాడు-లాబేసు వంతెన, గుమ్మడి గెడ్డ, జంఝావతి, వనకాబడి అలాగే పలు రహదారులు అధ్వానంగా ఉన్నా కనీసం ఒక్క పని కూడా చేసిన పరిస్థితి కనిపించలేదు. కావున గిరిజనులు పూర్తిస్థాయిలో ఆలోచించి వచ్చే ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కురుప నియోజవర్గ పరిశీలకులు మహేష్, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దత్తి లక్ష్మణరావు, అరుకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జి సుదర్శన్ రావు, మండలాల టిడిపి కన్వీనర్లు, నాయకులు డొంకాడ రామకష్ణ, పలువురు టిడిపి




సభలో మాట్లాడుతున్న కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జగదీశ్వరి

అరసాడ తోటల్లో ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న మామిడి, జీడితోటల్లో మంగళ వారం ఏనుగుల గుంపు ప్రవేశించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అటువైపు పొలం పనులకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే విషయం తెలిసిన అటవీశాఖ అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకున్నారు. ఏనుగులు ఉదయం అంతా ఒకే దగ్గర ఉంటాయని, సాయంత్రం అవి వెలుతురు ఉన్న ప్రదేశాలకు చేరుకుంటాయని అన్నారు. ప్రజలంతా రాత్రిపూట బయటకు రాకుండా సాయంత్రం పొలాలకు వెళ్లకుండా ఉండాలని ఎస్ఐ ప్రశాంత్ కుమార్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అటవీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



అరసాడ తోటలో తిష్టవేసి ఏనుగులు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో రెండో విడత మిగిలిన సీట్లు ప్రవేశానికి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆగస్టు 1లోగా ప్రభుత్వ ఐటిఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. iti.ap.gov.in వెబ్ సైట్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆగస్టు 3న కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. ఎలక్ట్రికల్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, డ్రెస్ మేకింగ్ తదితర కోర్సుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

అధిక వర్షాలతో పంట రక్షణకు చర్యలు

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రస్తుతం వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, ఇలా కురవడం వల్ల ఎక్కువ వేసవి దిక్కులు చేసుకునే వాళ్లకు భూమిలో నీరు నిల్వ ఉంటుందని కనిపక్షంలో వదగా పోతుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎ.మధుసూదనరావు అన్నారు. మండలంలోని పాంచాలి, మాతుమూరు రైతు భరోసా కేంద్రాలను పరిశీలిస్తూ అందుబాటులో ఉన్న రైతులతో మాట్లాడారు. మొక్కజొన్న పంటకు నీరు నిల్వ ఉంటే దిగుబడి తగ్గిపోతుందని కాబట్టి నిల్వ నీరు పోయే సదుపాయాన్ని కల్పించాలని సూచించారు. అనంతరం దశపత్ర కషాయాన్ని రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ కె.తిరుపతిరావు, విఎఎ దినేష్ కుమార్, సిఆర్‌పి తిరుపతి నాయుడు, రైతులు పాల్గొన్నారు

ఏకలవ్య పాఠశాలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిమ్మక లహరి, జ్యోత్స్న, ఆరిక యోగేశ్వరరావు, పాలక కౌశిక్ ఏకలవ్య ప్రవేశ పరీక్ష రాసి ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు ప్రసాదు తెలిపారు. వీరిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యనారాయణ అభినందించారు విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉంటూ వైద్య సేవలు అందించాలని తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ అన్నారు. మండలంలోని మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఓపి హాజరు, రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా రాత్రి సమయంలో పిహెచ్‌సిలో సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అత్యవసరమైతే రిఫర్ చేయాలి తప్ప ప్రజల చికిత్స మాత్రం తప్పనిసరిగా అందించాలన్నారు. కొద్ది సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - బలిజిపేట

దొంగతనాలు, ప్రమాదాల నివారణకు స్థానికంగా ఉన్న సంతతోట నాలుగు రోడ్ల కూడలి, తుమరాడ కూడలి వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు కూడా ఇవి ప్రాధాన్యత వహిస్తాయని తెలిపారు. ఆయా గ్రామాల పెద్దలతో చర్చించి ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు.



సిసి కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

ఎటిఎం విధానం రైతుకు ఎంతో మేలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రకృతి వ్యవసాయంలో ఎటిఎం విధానంలో కూరగాయలు, ఆకుకూరలు పండించడం ద్వారా నిత్యం ఆర్థికంగా రైతులకు ఎంతో వెసులుబాటు ఉంటుందని, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు అన్నారు. మంగళవారం అడ్డాపుశీలలో రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎటిఎం విధానంలో పంటపండించుకోవడంపై అవగాహన కల్పించారు. కనీసం 20 సెంట్లు స్థలం ఉంటే చాలు పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు పండించుకుని ఏడాది మొత్తం ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ట్రైనర్ వైశ్రీరాం పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సత్కారం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని ఎల్ఎన్‌పురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించిన భోగి రవికుమార్‌ను మంగళవారం గ్రామస్తులు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. సర్పంచ్ జక్కు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుని సేవలు కొనియాడి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కవి, రచయిత తుంబలి శివాజీ, కొత్తాడ నాగభూషణరావు ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మర్రిపాడు గ్రామ సచివాలయ పరిధిలో గల జజ్జువ, గూడిగుడ్డి గూడ, పెదబగ్గ, పెద్దగూడ, మర్రిగూడ, సంధిగూడ, తోటగూడ, మర్రిపాడు గ్రామాల్లో "గడప గడప - మన ప్రభుత్వం" కార్యక్రమం ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యాన జరిగాయి. ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సవరలక్ష్మి, ఎఎంసి చైర్మన్ హిమారిక మోహన్‌రావు, స్థానిక సర్పంచ్ ఊయక రమ, స్థానిక ఎంపిటిసి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురంలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో బస్సుయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కె.అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకట్రావు, తదితరులు పాల్గొంటారన్నారు. కావున కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సీతానగరం మండలం, నిడగల్లు గ్రామానికి చెందిన గొట్టాపు తాతబాబు అనే వివాహితుడు గత కొద్ది రోజులుగా మానసికంగా ఆందోళన చెందుతున్నాడు. రెండు రోజుల క్రితం గురుగుబిల్లి మండలం రావివలస గ్రామానికి చెందిన తన అత్తవారింటికి వెళ్లినప్పటికీ మనసులో తీవ్రమైన ఆందోళన ఉండడంతో తన ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక తుప్పల్లో ఎవరికీ కనబడకుండా వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. కడుపులో వికారం ఎక్కువ కావడంతో భయపడి విషయాన్ని ఫోన్ లో తన భార్యకు తెలుపగా, స్పందించిన ఆమె పార్వతీపురం కాంప్లెక్స్ కు చేరుకుని జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

జగనన్న సురక్షతో మరిన్ని సేవలు:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి సచివాలయ పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు,వివిధ ప్రభుత్వ పథకాలతో పాటు ప్రభుత్వ సేవలకు సంబంధించి ఏవైనా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ప్రజలకు రక్షగా.. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చిందని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూరంగి వెంకినాయుడు, ఎఎంసి చైర్మన్ చైర్మన్ హిమారిక మోహన్‌రావు, సచివాలయ కన్వీనర్ కోటేశ్వరరావు, తహశీల్దార్ నర్సింహామూర్తి, ఎంపిడిఒ కొండపల్లి సత్యం, ఎంఇఒలు ఆనందరావు, సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని వడ్డంగిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ఎమ్మెల్యే వి.కళావతి లబ్దిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వడ్డంగి సర్పంచ్ కొండగొర్రి ఉషారాణి, పిఎసిఎస్ చైర్మన్ బోదేపు రఘుపతినాయుడు, జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, కొరమ సర్పంచ్ అగుతముడి రఘుపతి నాయుడు, జెడ్పిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి ప్రసాదరావు, గెల్లంకి రమేష్, పలువురు అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు ప్రజలు ఇంటి వద్దకే వచ్చి అందజేయడం జరుగుతుందని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. మండలంలో మాదలింగిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న 52 మంది ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అలాగే ఎంపిడిఒ మల్లికార్జున ఆధ్వర్యంలో పెదశేఖలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధులను సందర్శించి ప్రజల సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఎఒ శంకరరావు, సర్పంచ్ కళావతి, తోడుము సర్పంచ్ వై.సింహాచలం, నాయకులు శెట్టి మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శి జగత్, వాలంటీర్లు సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సాలూరు: మండలంలోని బాగువలసలో సర్పంచ్ రెడ్డి సుకన్య ఆధ్వర్యాన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి మాట్లాడుతూ అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ కుమార్ పాల్గొన్నారు. **పట్టణంలో:** మున్సిపాలిటీ పరిధిలోని 13,14వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం అక్కేన వీధి, బంగారమ్మ కాలనీలో నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్‌లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొని ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు హరి అప్పలకొండ, పి.మధుసూధనరావు, వైసిపి నాయకులు హరి బాలాజీ పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని పెదపదంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిడిఒ ఎ.రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి వివిధ రకాలు ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రెడ్డి పావని, కార్యదర్శి రోహిణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: మండలంలోని బాలగొడబ, జమదాల సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యరక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడివో ఎస్ రమేష్, తహశీల్దార్ శివన్నారాయణ, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పిటిసి బలగరేవతి, వైస్ ఎంపిపి సిద్దాజగన్నాథరావు, బలగొడబ సర్పంచ్ రాములమ్మ, ఎంపిటిసి నీలవేణి, నాయకులు బంకపల్లి రామకృష్ణ, పండు, ముమ్వల సత్యనారాయణ, సీనియర్ నాయకులు, మజ్జి చంద్రశేకర్, బలగనాగేశ్రావు, బొమ్మిరమేష్, భీమరపు కృష్ణమూర్తి, మడక విశ్వనాథం వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని గెడ్డలిప్పి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ మాట్లాడుతూ ప్రభుత్వం 11 రకాల సేవలను ఈ కార్యక్రమంలో ద్వారా ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, శ్రీరాములునాయుడు, ఎంపిడిఒ ఎంఎస్ఇఎల్ఎన్, ప్రసాద్, తహశీల్దార్ ఎంవి రమణ, ఆయా గ్రామ సర్పంచులు, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, ఎన్.ధనుంజనాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: నగర పంచాయతీలో కోటదుర్గ సచివాలయం పరిధిలోని 9, 14 వార్డులు, గారమ్మ కాలనీ సచివాలయం పరిధిలోని 17, 19 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ పి.విక్రాంత్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన వారు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధా కుమారి, వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, కౌన్సిలర్లు కొరికాన గంగు నాయుడు, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, కొంచాడ అరుణ్, దుప్పాడ పాపినాయుడు, కడ్రోతు లక్ష్మీ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా 11 రకాల సర్టిఫికెట్స్ ను ఎమ్మెల్సీ అందజేయడం జరిగింది.

వీరఘట్టం : మండలంలోని కత్తులకవిటిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. స్థానిక జడ్పిటిసి జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వర రావు అర్జీదారులకు వివిధ రకాల ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.కిరణ్ కుమార్, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, సర్పంచ్ జీ సరోజిని, ఎంపిటిపి కె.పరిమళ, సీనియర్ నాయకులు రిషికేశవరావు, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ



సీతంపేట: ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

జనాభా నియంత్రణ చేయకపోతే నష్టాలు

ప్రజాశక్తి పార్వతీపురంటౌన్

జనాభాతో పెరుగుదలతో పేదరికం పెరుగుతుందని, జనాభా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బగాది జగన్నాథరావు తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం స్థానిక ఎన్‌జిఒ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వ్యాసరచనలో గెలుపొందిన విద్యార్థులకు, చక్కని పనితీరు కనబరచిన డాక్టర్లకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, బహుమతులు, అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల మధ్య ఎడం పాటించడం, బాల్య వివాహాలు నిరోధించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంటు బి.వాగ్దేవి మాట్లాడుతూ జనాభా నియంత్రణకు బాల్యవివాహాలు నివారణ, పిల్లల మధ్య ఎడం పాటించడం పద్దతులు పాటించాలని, మాతా శిశు మరణాలను తగ్గించడం ద్వారా ఎక్కువ మందికి జన్మనివ్వకుండా అవగాహన కల్పించవచ్చునని తెలిపారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య మిషను అమలులో మన జిల్లా ప్రథమ స్థానం లో ఉందన్నారు. జనాభా పెరుగుదలతో నష్టాలతో పాటు లాభాలు కూడా ఉన్నాయని, నేడు ప్రపంచంలోనే అత్యధిక యువత, మానవవనరులు కలిగిన దేశం మనదేనన్నారు. అయినా జనాభా నియంత్రణ ఉంటే మెరుగైన విద్య, వైద్యం అందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసరు దవళ భాస్కరరావు, డాక్టరు విజయ మోహన్, డా. వినోద్ జనాభా పెరుగుదలతో వచ్చే విపత్తులు, నివారణ చర్యలు గూర్చి ప్రసంగించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఎ.ఎన్.ఎం.లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బుద్దేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమములో సిహెచ్ఒ పద్మ, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి, సూపర్వైజర్స్ ఐ.శ్రీను, సింహాచలం, ఎర్రయ్యమ్మ, ఆరోగ్య సహాయకులు నిమ్మకూరి రత్న ప్రసాద్, ఎస్‌వి ప్రకాష్, బి.లక్ష్మణ, ధన లక్ష్మి, అర్చన , ఎమ్.ఎల్.హెచ్.పి.లు, ఆశా లు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు



యూనిఫారం పరిశీలిస్తున్న సంక్షేమాధికారి

ఆశ్రమ పాఠశాలలు సందర్శన

సీతంపేట: స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల, బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమాధికారి కె.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారా లేదా, రికార్డుల పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. స్టాక్ రూమును పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా పాఠాలు బోధించాలన్నారు. సిలబస్ ఎంతవరకు జరిగిందో చూశారు. ఆయన వెంట ఎటిడబ్ల్యూఒ జి.మంగవేణి, ప్రధానోపాధ్యా యులు ఎ.లిల్లీ రాణి, టి.చంద్రరావు, వసతిగృహ అధికారి పి.అమల, డిప్యూటీ వార్డెన్ గాశయ్య పాల్గొన్నారు.

టిడ్కో ప్రాజెక్ట్‌తో తీరనున్న తాగునీటి కొరత

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

రూ.80 కోట్లతో పట్టణ ప్రజల అవసరార్థం నిర్మించనున్న టిడ్కో గృహ సముదాయాలకు రూ.12 కోట్లతో భారీ మంచినీటి సరఫరా పథకం అందుబాటులోకి రానుందని, దీనివల్ల పట్టణానికి తాగునీటి కొరత తీరనున్నట్లు రాష్ట్రటిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రాజెక్టుకు సంబంధించి స్థల పరిశీలన చేశారు. అనంతరం అడ్డాపుశీలలో నిర్మాణం చేపట్టిన టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ పనులను పరిశీలించి ఆయా గృహ సముదాయాలకు శాశ్వత ప్రాతిపదికన మంచి నీటి సరఫరా అందించేలా చేయబోవు కార్యాచరణ గురించి అధికారులతో చర్చించారు. ప్రస్తుతం నీటి లభ్యత కొరత కారణంగా రెండు రోజులకు ఒకసారి నీరందిస్తున్న సమస్య నుంచి ప్రతిరోజూ నీరివ్వడానికి ప్రణాళిక తోటపల్లి ఇరిగేషన్ అధికారులు నుంచి అనుమతి లభించిన దరిమిలా పబ్లిక్ హెల్త్, టిడ్కో సంయుక్తంగా రూ.12 కోట్లతో పథకాన్ని చేపడుతున్నామని తెలిపారు. దీని ద్వారా కనీసం 50లక్షల లీటర్ల నీరు లభ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడ్కో ఎస్ఇ డి.నరసింహమూర్తి, పబ్లిక్ హెల్త్ ఇఇలు దక్షిణ మూర్తి, జ్యోతి, డిఇఇ బాలకృష్ణ, మున్సిపల్ ఇంజనీర్లు, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది మరియు స్థానిక నాయకులూ ప్రజలు పాల్గొనడం జరిగింది.



స్థల పరిశీలన చేస్తున్న జమ్మాన ప్రసన్నకుమార్, అధికారులు

సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన

ప్రజాశక్తి - బెలగాం

స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, హాస్టల్ సమస్యల పరిష్కారం కోసం పిడిఎస్‌యు ఆధ్వర్యాన విద్యార్థులు మంగళవారం ఆందోళన తెలిపారు. రాష్ట్ర పిలుపులో భాగంగా స్థానిక కళాశాలల విద్యార్థులు కలెక్టర్ ఆఫీస్ మీదుగా ర్యాలీగా వచ్చి కాంప్లెక్స్ వద్ద మానవహారం చేసి, అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిని అందజేశారు. అనంతరం పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎన్ భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ, ఇతర కళాశాలలు ల్యాబ్‌లు, అధ్యాపకులు ఇతర మౌలిక సదుపాయాల కొరతతో కునారిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు కె.సోమేశ్ మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని, కొమరాడలో కాలేజీ విద్యార్థులకు కొత్తగా హాస్టల్ ఏర్పాటు చేయాలని, గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, డిగ్రీలో ప్రవేశ పెట్టబోతున్న సింగిల్ సబ్జెక్ట్ ప్రోగ్రాంను, మల్టీ ఎంట్రీ - మల్టీ ఎగ్జిట్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్న్ షిప్ విధానాన్ని రద్దు చేయాలి.

పాలిటెక్నిక్, ఐటిఐ విద్యార్థులకు సరైన పద్ధతిలో ఇంటర్న్ షిప్ ను నిర్వహించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు మరికొన్ని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగస్టు 16 నుంచి బస్సు యాత్ర : సిపిఐ


ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్రాన్ని రక్షించండి- దేశాన్ని కాపాడండి, నినాదంతో ఆగస్టు 16 నుంచి జరుగు బస్సు యాత్ర ను జయప్రదం చేయండని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. పార్వతీపురంలో జరుగు పార్టీ సమావేశాలకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహించినట్లు ఈశ్వరయ్య తెలిపారు. ఈ బస్సు యాత్ర విశాఖ స్టీల్ ప్లాంట్ మెయిన్ గేటు (కూర్మన్నపాలెం) నుంచి ప్రారంభమై శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం మీదుగా సాగి సెప్టెంబర్ 6న తిరుపతిలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, వినయ్ విశ్వంలు తదితర జాతీయ నాయకులు పాల్గొంటారన్నారు. అలాగే పార్వతీపురంలో పాత బస్టాండ్ వద్ద జరిగే బస్సు యాత్రకు స్వాగతం పలుకుతూ, జరిగే బహిరంగ సభలో పార్టీ శ్రేణులు, ప్రజలు యావత్తు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు, కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, సహాయ కార్యదర్శి తోట జీవ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యువగళానికి సంఘీభావంగా పాదయాత్ర

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

వైసిపి వైఫల్యాలను ఎండగడుతూ, భవిష్యత్తుపై ప్రజలకు భరోసానిస్తూ సాగుతున్న టిడిపి యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర సమకాలీన రాజకీయాల్లో సరికొత్త ప్రభంజనాన్ని సృష్టిస్తోందని పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. యువగళం పాదయాత్ర 2వేల కిలోమీటర్లకు చేరుకున్న సందర్భంగా యువనేతకు శుభాకాంక్షలు తెలియచేస్తూ సంఘీభావంగా పాలకొండ మండలం గొట్టమంగళాపురంలో సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, సీనియర్ నాయకులు కిమిడి కాశింనాయుడు, జాడ శ్రీధర్, తెలుగు యువత అధ్యక్షులు సిరిపురం జగదీశ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు జీలకర్ర మోహన్ రావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు సురవరం సుందర్ రావు, మరియు కమిటీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ లు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సంఘీభావ యాత్ర చేస్తున్న నాయకులు

బదిలీలు సహజమే

వీరఘట్టం: ఉపాధ్యాయులకు బదిలీలు సహజమేనని ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆనందరావు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీపీ బీసీ కాలనీ పాఠశాలలో ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ఏ పాఠశాలకు వెళ్లిన అక్కడ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆదేశించారు. ప్రస్తుతం అమలవుతున్న నూతన విద్యా విధానంలో విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బదిలీపై వెళ్లిన ఎ.శ్రీహరి నాయుడు, ఎన్.రామకృష్ణ, పి.మురళీకృష్ణ, వి.గౌరినాయుడుకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కె.విజయకుమార్ విజయకుమార్ , ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపిలో గ్రూపు రాజకీయాల్లేవు...

గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన బస్సుయాత్ర విజయవంతం కావడంతో టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్తేజం, ఉత్సాహం నింపింది. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బస్సు యాత్రలో రెండు గ్రూపుల వారు కలిసికట్టుగా పాల్గొన్నారు. దీంతో టిడిపిలో పూర్వ వైభవం కనిపించింది. బస్సు యాత్రలో దారి పొడవునా టిడిపి జెండాలో రెపరెపలాడాయి. టిడిపిలో గ్రూపు రాజకీయాలు ఎక్కడా లేవని, ఆశావాహుల టిక్కెట్ కోసమే కేవలం ప్రయత్నాలు జరిగాయని టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు వివరించారు. ఇకనుంచి పార్టీ కార్యక్రమాలు క్రమశిక్షణతో జరుగుతాయన్నారు. మనలో ఐక్యత లేకపోవడమే స్థానిక ఎమ్మెల్యే రెండుసార్లు గెలిచిందన్నారు. రానున్న ఎన్నికలకు దశ, దిశ నిర్దేశించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చిన మేరంగి రాజులను ఓడించడమే లక్ష్యంగా 2024 ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. చాలా రోజుల తర్వాత ఒకే వేదికపై టిడిపి ఇన్చార్జి జగదీశ్వరి, దత్తి లక్ష్మణరావు కనిపించారు. ఇరు గ్రూపుల కలయికతో పసుపు దండు విజయం తప్పదని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.



మాట్లాడుతున్న దత్తి లక్ష్మణరావు

పవన్ క్షమాపణ చెప్పాలని వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

వాలంటీర్లనుద్దేశించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం పట్టణంలోని వార్డు వాలంటీర్లు బోసుబొమ్మ జంక్షన్‌లో ధర్నా చేశారు. జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యాన వాలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, పట్టణాల్లో నిస్వార్థంగా సేవలందిస్తున్న వాలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అన్నారు. బేషరతుగా ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొల్లి వెంకటరమణ,వాలంటీర్లు పాల్గొన్నారు.

మండలంలోని బాగువలస, పెదపదం, నాలర్లవలసలో వాలంటీర్లు పవన్ కల్యాణ్ చిత్రపటాలను దగ్ధం చేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ కుమార్, సర్పంచ్ రెడ్డి సుకన్య ఆధ్వర్యాన వాలంటీర్లు నిరసన తెలిపారు.

కురుపాం : వాలంటీర్ వ్యవస్థపై పవన్ వ్యాఖ్యలపై కురుపాంలో సచివాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పవన్ కళ్యాణ్ చిత్రపటాలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో కురుపాం మండలంలో గల వాలంటీర్లు అందరూ పాల్గొన్నారు.

సీతానగరం : వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని స్థానిక హనుమాన్ జంక్షన్‌లో మానవహారం చేసి అనంతరం బజార్ వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : స్థానిక ఆర్టీసీ కూడలిలో వాలంటీర్లు మానవహారంగా ఏర్పడి, పవన్ కల్యాణ్‌పై నిరసన పోస్టర్లు ప్రదర్శించి, దిష్టి బొమ్మలు తగలబెట్టి తమ నిరసన తెలిపారు. పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.**వీరఘట్టం :** స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాన వహారం చేపట్టి పవన్ కళ్యాణ్ నున్న కార్డును చెప్పులతో కొట్టి చించి వేసి క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలం టీర్లు పాల్గొన్నారు.



సాలూరు: నిరసన తెలుపుతున్న వాలంటీర్లు